క్లుప్తంగా

ఓవర్‌హెడ్ ట్యాంకుల శుద్ధి



కాశీపేటలో ట్యాంక్‌ను శుద్ధి చేయిస్తున్న కార్యదర్శి మురళి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నాలుగు రోజులుగా సర్పంచ్‌ల పర్యవేక్షణలో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల్లో భాగంగా కాశీపేటలో పంచాయతీలో ఉన్న రెండు ఓవర్ హెడ్‌ట్యాంక్‌లను కార్యదర్శి మురళి వేతన దారులతో సోమవారం శుద్ధి చేయించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ సూచనల మేరకు అయిదురోజులుగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య పనులు పూర్తి కావస్తుండడంతో వీధికుళాయిలు, వ్యాటర్‌ట్యాంక్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుద్ధి చేసి, క్లోరినేషన్ పూర్తి చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం ఆయన పట్టణంలోని నవిరికాలనీలో పేదలకు చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు వచ్చిన జీతంలో ప్రతి నెలా కొంత మొత్తం వెచ్చించి పేదలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని చెప్పారు. అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలో గల పేదలకు సేవ చేసి వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నవిరి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై దృష్టిసారించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్

పాలకొండ రూరల్: పట్టణంలో రాత్రి సమయంలో పోలీసుల గస్తీ ముమ్మరం చేయాలని, మద్యం, సారా, గంజాయి, గుట్కా వంటి నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై దృష్టి సారించి, అరికట్టాలని ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో నైట్ పెట్రోలింగ్ సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆయన.. ఏయే ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేపట్టాలన్న విషయాలను వివరించారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వివరాలను ఆరాతీయాలని, లాడ్జీల్లో ఎవరైనా అనుమానితులు ఉంటున్నారా లేదా అనే విషయం తెలుసుకోవాలన్నారు. అనంతరం పాలకొండ-సీతంపేట రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని వాహనదారులను ఆయన కోరారు.

నిర్మానుష్యం



జనసంచారం లేని భామిని ప్రధాన రోడ్డు


భామిని: మండలంలోని ప్రధాన వీధులు, రోడ్లు సోమవారం నిర్మానుష్యంగా కనిపించాయి. ఉదయం విపరీతమైన ఎండలు.. సాయంత్రం వర్షపుజల్లులతో చల్లని వాతావరణం నెలకొంటోంది. మధ్యాహ్నం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఎండతీవ్రతకు భయపడి ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. అయితే ఉదయం ఎండ, సాయంత్రం వాన వంటి భిన్నరకాలైన వాతావరణాలను ప్రజలు ఆస్వాదిస్తుండడం విశేషం.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అర్జునరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ సమావేశానికి హాజరవుతారని, అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.



పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం



పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం రోడ్డు దగ్గరి పొలాల్లోకి చేరిన వరదనీరు



పాలకొండ రూరల్: కస్పా వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ముంచెత్తిన వాన

పాలకొండ, సీతంపేట మండలాల్లో భారీ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం సోమవారం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కాగా, పొలాలు, రోడ్లు, వీధుల్లోకి భారీగా వర్షపునీరు వచ్చి చేరింది. రోడ్లపై నదీ ప్రవాహంలా తలపించిన వరదనీరు కారణంగా వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

-పాలకొండ, పాలకొండ రూరల్, సీతంపేట



వర్షపునీటిలో పాలకొండ పంచాయతీరాజ్ కార్యాలయం



నదీ ప్రవాహాన్ని తలపిస్తున్న పాలకొండ-సీతంపేట రోడ్డు



సీతంపేట: వర్షం కారణంగా సీతంపేట వారపు సంతకు తగ్గిన రద్దీ

భద్రతా నియమాలు పాటించాలి



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మక్కువ: రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని ఎస్సై పి.నరసింహమూర్తి అన్నారు. ఈ మేరకు మక్కువ మండలకేంద్రంలోని మూడు రోడ్లజంక్షన్‌లో సోమవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారు లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ప్రయాణించడం సురక్షితమన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడిపినా, అక్రమంగా మద్యం, సారా తరలించినా కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అపరాధ రుసుం బకాయి ఉన్న చలనాలను వాహనదారులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటు కష్టాలు తొలగించండి



సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్‌వైనాయుడు

సాలూరు: అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి, పట్టణ ప్రజలకు కరెంట్ కష్టాలు తొలగించాలని సీపీఎం సాలూరు పట్టణ కార్యదర్శి ఎన్‌వైనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 14న పట్టణంలో కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి చెట్లు విరగడం తోపాటు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలాయని, ఇది జరిగి 4 రోజులవుతున్నా నేటికీ పట్టణంలో ప్రజలకు కరెంట్ కష్టాలు తీరడం లేదన్నారు. రోజూ ఎక్కువసేపు కరెంటు తీయడం వల్ల కరెంట్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రజలు అసౌకర్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మెయిన్‌రోడ్డు, పోస్టాఫీస్, డీలక్స్‌సెంటర్ తదితర ప్రాంతాల్లో కూలిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేటికీ తీయలేదని, దీనిపై కలెక్టర్ స్పందించి పట్టణంలోని అధికారులతో మాట్లాడి, పై సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రజలందరితో కలిసి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

వైభవంగా రమా సత్యనారాయణస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతానగరం: మండలంలోని లక్ష్మీతిరుమల లచ్చయ్యపేట ఎన్సీఎస్ కర్మాగారంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీరమాసత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. కల్యాణం అనంతరం స్వామివారిని పల్లకీలో ఉంచి తిరువీధి చేసారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధి ఎం.సూర్యనారాయణ, అర్చకుడు పవన్‌కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ ఎన్‌సీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం మేనేజింగ్ డైరక్టర్ ఎన్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు లోక కల్యాణార్థం పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బలిహరణ, మహాశాంతి హోమం, ప్రసాదాల వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఆలయానికి చుట్టు పక్కలున్న గ్రామాల ప్రజలతో పాటు శ్రీసత్యనారాయణస్వామి భక్తులు అధిక సంఖ్యలో కల్యాణంలో పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సేల్స్‌మన్‌లు

కురుపాం: ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక పట్టణంలోని ఓ ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటీకరణ చేస్తుందనే ప్రచారం జోరందుకుందని, దీంతో తాము, తమను నమ్ముకున్న కుటుంబాలు రోడ్డునపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలను అప్పగించినా వాటిల్లో తమనే కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

తాళం భజన పోటీలు ప్రారంభం



భజన పాటలు ఆలపిస్తున్న సాలూరు కళాకారులు



పోటీల్లో పాల్గొన్న బలిజిపేట మహిళా కళాకారులు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సాయిరాం భజన మండలి సమాజం ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ స్థాయి తాళం భజన పోటీలు ప్రారంభం కాగా మొదటి రోజున 10 టీంలు పాల్గొన్నాయని నిర్వాహకుడు సీహెచ్ వెంకటరమణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళం భజన పోటీల్లో పాల్గొనేందుకు యువతీ యువకులు ఉత్సాహం చూపడం అభినందనీయమన్నారు. గ్రామస్తులతో పాటు కళాకారులు ఇచ్చిన ప్రోత్సాహంతో తాళం భజన పోటీలు లక్ష్మీపురంలో బుధవారం వరకూ నిర్వహించాలని సంకల్పించామని తెలియజేశారు. పోటీల్లో విజేతలైన వారికి సత్కారాలు, ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నామని తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



పూజలందుకున్న కల్యాణ వేంకటేశ్వరుడు

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామ పరిధిలో ఉన్న శ్రీవేంకటేశ్వరాలయంలో మహాలక్ష్మి సమేత శ్రీనివాసుని కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు అంపోలు సీతారామాచారి, కన్నబాబుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చరణల నడుమ స్వామి కల్యాణోత్సవం చేశారు. పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి కల్యాణం తిలకించారు.

అక్రమంగా మూగజీవాల తరలింపు



ఏబీ రోడ్డు మీదుగా తరలిస్తున్న పశువుల మంద

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు మీదుగా అక్రమంగా మూగజీవాలు తరలిస్తున్నారు. కొంతమంది పశువులను మందగా తరలిస్తే మరి కొంతమంది వాహనాల్లో తరలిస్తున్నారు. కొత్తూరు మండలంలోని బలద సంతకు ఎక్కువగా వీటిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి, మూగజీవాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

శ్రమదానంతో నేలబావి ఏర్పాటు



నేలబావి ఏర్పాటులో నిమగ్నమైన దండుసూరగూడ గిరిజన యువత

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ, దండుసూరగూడ గ్రామంలోని గిరిజన యువత శ్రమదానం చేసి, మరీ నేలబావి ఏర్పాటు చేసుకోవడం అధికారులను ఆలోచింపజేసేలా ఉంది. గత కొన్నిరోజులుగా గ్రామంలో తాగునీటి ఎద్దడి పరిస్థితులు నెలకొనడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయాన్ని అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో విసుగుచెందిన వారు గ్రామ సమీపంలోని గెడ్డ పక్కన నేలబావి ఏర్పాటు చేసుకున్నారు. తాగునీటికి, స్నానానికి కొంతవరకు ఫర్వాలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పట్టణంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: జిల్లాలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోందని పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సోమవారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున డ్రైవ్‌ను నిర్వహించామన్నారు. పార్వతీపురం మండలంలోని గోచెక్క, తాళ్లబురిడి, డోకిశీల, పీబీ పల్లి, కవిటిభద్ర, భామిని మండలంలోని కొత్తగూడ, సందివలస, పాలకొండ మండలంలోని లుంబూరు, ఎల్‌ఎల్ పురం, గుమ్మలక్ష్మీపురం మండలం మండ, తాడికొండ, వనకాబడి, బాలేసు, కుక్కి, గుమ్మలక్ష్మీపురం, కేదారిపురం, ఆర్. జమ్ము, సీతంపేట మండలంలోని బుడగరాయి, వజ్జాయిగూడ, పాత పణుకువలస, కడగండి, పబ్బాడ, తుంబకొండ, గెద్దగూడ, చింతాడ, కుమ్మరిగొండ, కురుపాం మండలం ఊసకొండ, గొట్టిలి, జియ్యమ్మవలస ఆర్మడ తదితర గ్రామ పంచాయతీలతో సహా ఇతర మండలాలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య డ్రైవ్ కొనసాగించినట్లు వివరించారు. గ్రామాల్లోని కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్ఓ) కార్యకలాపాలను స్వయంగా తాను పరిశీలించానని చెప్పారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను ఈ సందర్భంగా ఆయన పిచికారీ చేయించారు. జిల్లాలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకున్న చర్యల్లో భాగంగా దోమలపై దండయాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ, మలేరియా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు



బగ్గందొరవలస వద్ద విరిగిన విద్యుత్ స్తంభం

సీతానగరం: ఈదురుగాలులతో కూడిన వర్షాల కారణంగా సీతానగరం మండలంలోని తామరఖండి ఫీడర్ పరిధిలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగి కూలిపోయాయి. ఈ మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పవర్‌సప్లై చేయనున్నామని ఏఈఈపీడీసీఎల్ ఏఈ జగన్మోహనరావు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తామరఖండి, గెడ్డలుప్పి, బగ్గందొవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతున్న లైన్‌లో గాలికి మూడు విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయని తెలియజేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అవసరాల దృష్ట్యా వేరే లైన్ నుంచి విద్యుత్ సరఫరాలకు చర్యలు చేపట్టామని తెలిపారు. రెండు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు పూర్తిచేసి విరిగిపడిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేయనున్నామని చెప్పారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



చంద్రంపేటలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంవో జగన్‌మోహన్‌రావు

కొమరాడ: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి(డీఎంవో) టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని చంద్రంపేట, మార్కొండపుట్టి గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, వైద్యారోగ్య సిబ్బంది చేపడుతున్న ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమ అమలును పరిశీలించారు. ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యానికి జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని గ్రామస్తులను కోరారు. ప్రతీ శుక్రవారం డ్రైడే తప్పనిసరిగా పాటిస్తూ ఇంటి ముందు, ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయని, దోమల బారినపడకుండా వీలైనంతవరకు దోమతెరలు వాడాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా అప్రమత్తమై ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి, వారికి చికిత్స అందేలా చూడాలన్నారు. కాలువలు, మురుగునీటి ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. అలాగే బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాలు, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

భామిని: హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లికి మండల జనసేన పార్టీ కార్యకర్తలు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ ఘనవిజయం సాధించినందుకు గాను అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల శాఖ కన్వీనర్ రుంకు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.